**75**
**ధారావాహిక**



# జాయ సేనాపతి

## చారిత్రక కాల్పనిక నవల


మత్తి భానుమూర్తి ...
99893 71284


**జరిగిన కథ :** రాజ్య ప్రముఖులతో సమావేశమయ్యాడు చక్రవర్తి. కాకతీయ గజసైనికశక్తి దుర్భేద్యంగా కనిపించాలనీ, అందుకోసం జాయపుణ్ని గజసాహిణిగా నియమిస్తున్నామనీ ప్రకటించాడు. అయితే, ఈ నిర్ణయం సర్వసేనాని రేచర్ల రుద్రయదైనా.. సలహా ఇచ్చింది మాత్రం గజసాహిణి కొమురయ. ఆ సలహా ఇవ్వడానికి గల కారణాన్ని సభికులకు వివరిస్తున్నాడు కొమురయ.

“అలా అలా జాయపుడు తన ప్రాణాలను, సర్వశక్తులను, ప్రతిభాపాటవాలను ఆ కాహళిలో పెట్టి.. నిర్విరామంగా, ఆకాశం విరిగిపడేలా.. చెట్లు చేమలు ఊగిపోయేలా.. ఏవేవో ఆదేశాలను కూజితాల రూపంలో మార్చి మార్చి వాయిస్తూ.. వాటితో మాటామంతీ నెరపుతూనే ఉన్నాడు. అవి భయం పోగొట్టుకుని మెల్లమెల్లగా ఊబి నుంచి బయటపడే ప్రయత్నాలు చేయడం.. ఊబిలో ఓ కాలు బలంగా వేస్తే, మూడుకాళ్లు పైపైన వేస్తూ ఊబి అంచువైపు కదలడం మొదలెట్టాయి. వాటికవే ఒకదానికి ఒకటి సహకరించుకుంటూ.. జాయపుని వైపు చూస్తూ ఆయన చెప్పేది వింటూ బయటికి కదలడం.. నిజంగా అద్భుతం! అన్ని.. మొత్తం ఊబిలో దిగబడ్డ ఏనుగులన్నీ ఒక్కటొక్కటిగా బయటికి వచ్చేశాయి ప్రభూ.. ఈ అద్భుతం ఈ భూమ్మీద ఎక్కడా, ఎప్పుడూ జరిగినట్లు వినలేదు. ఆయనలో ఏదో గొప్ప దివ్యశక్తి ఉండబట్టే అది సాధ్యమయ్యింది. దాదాపు ఐదొందల ఏనుగులు.. అంత పెద్ద శరీరమున్నవి ఊబిలో దిగబడితే రక్షించడం మానవుడి వల్లకాదు. అలాంటిది.. జాయపులవారు ఒక్క ఏనుగు కూడా ఊబిలో దిగబడిపోకుండా కాపాడారు ప్రభూ! అంత అద్భుతం ఆయన నా కళ్ల ముందే చేస్తే.. ఆయన ముందు నేనెలా గజసాహిణిగా ఉండగలను ప్రభూ!?”..

కొమురయ చెప్పడం ఆపిన పావుగంట వరకూ ఎవ్వరూ మాట్లాడలేదు. అంతా అతను చెప్పిన సన్నివేశాన్ని దర్శిస్తూ అలా రెప్పవేయకుండా.. ఊపిరి పీల్చకుండా ఉండిపోయారు. ఎప్పటిలా మామూలుగా కూర్చున్నది ఒక్క జాయపుడే. దాదాపు రెట్టింపు వయసున్న కొమురయ చెమరిస్తున్న కళ్లతో, ఆనందబాష్పాలతో వెళ్లి.. జాయపుని పాదాలనంటి నమస్కరించాడు. ఈ హఠాత్పరిణామానికి బిత్తరపోయిన జాయపుడు లేచి తిరిగి ఆయనకు పాదాభివందనం చేశాడు.

గణపతిదేవుడు, రుద్రయ, చౌండ.. తదితరులు పిల్లవాడిగా చూసిన జాయపునికి ఎలా నమస్కరించాలో తెలియక తలవొంచి కరతాళధ్వనులతో సత్కరించారు.

“ఆ.. జాయపా! ఏమి మౌనం.. నీ ప్రతిభ గురించి మేమంతా అబ్బురంగా చెప్పుకొంటుంటే మౌనంగా ఉన్నావేం?!”.. అడిగాడు రుద్రసేనాని.

జాయపుడు నవ్వి.. ఓ భర్తృహరి శ్లోకం చెప్పాడు.

“స్వాయత్త మేకాంత హితం విధాత్రా
వినిర్మితం ఛాదన మజ్ఞతాయాః।
విశేషతః సర్వ విధాం సమాజే
విభూషణం మౌనమపండితానామ్‌॥